క్లుప్తంగా

మరింత మెరుగ్గా సేవలందించాలి

• డీఎల్‌డీఓ ఎస్.రవీంద్ర

గజపతినగరం: జగనన్న గృహనిర్మాణాలను వేగవంతం చేసే బాధ్యతను ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తీసుకోవాలని బొబ్బిలి డీఎల్‌డీఓ ఎస్.రవీంద్ర అన్నారు. పురిటిపెంట-1, పురిటిపెంట-2 గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఈఓ జనార్దనరావు, పంచాయతీ సెక్రటరీ రమణ ఉన్నారు.

విద్యాశాఖ అధికారుల సస్పెన్షన్ అన్యాయం

గజపతినగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటిస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ జిల్లా విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం విచారకరమని ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు అన్నారు. గజపతినగరం మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎదో ఒక నెపంతో క్రమశిక్షణ చర్యలను తీసుకోవాలనేది ప్రవీణ్‌ప్రకాష్ ఆలోచనగా ఉందని, ఇది ఉపాధ్యాయులకు గొడ్డలి పెట్టుగా తయారైందన్నారు. ఇదే విధానం కొనసాగితే పాఠశాలల్లో విద్య సజావుగాసాగే పరిస్థితి ఉండదన్నారు.

కుట్టుమిషన్లు అందజేత

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి చర్చిలో టైలరింగ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న 30 మందికి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. చర్చి పాస్టర్ విక్టర్‌పాల్ ఆధ్వర్యంలో సర్పంచ్ సుంకరి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బేత రవి వాటిని లబ్ధిదారులకు అదజేశారు. తూర్పుగోదావరి జిల్లా కృష్ణునిపాలెంకు చెందిన ఇవాంజిలిస్ట్, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు పాస్టర్ ప్రశాంత్‌కుమార్ కుట్టుమిషన్లు సమకూర్చారు.

సోషల్ ఆడిట్‌పై హెచ్‌ఎంలకు శిక్షణ

గంట్యాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని ఎంఈఓ విజయలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల హెచ్‌ఎంలకు సోషల్ ఆడిట్‌పై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎంలు పేరెంట్స్ కమిటీలకు శిక్షణ ఇచ్చి అన్ని పాఠశాలల్లో సోషల్ ఆడిట్ నిర్వహించాలన్నారు. రిసోర్స్ పర్సన్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భూసర్వేతో రైతులకు మేలు

చీపురుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వే కార్యక్రమంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని జి.అగ్రహారం గ్రామంలో తహసీల్దార్ ఎం.సురేష్‌తో కలిసి శుక్రవారం డ్రోన్ సర్వేని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర భూముల సర్వే చేయిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పతివాడ రాజారావు, గెరిడి రామదాసు, కొసిరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసాకు 30లోగా దరఖాస్తు చేసుకోండి

దత్తిరాజేరు: రైతుభరోసా పథకం కోసం ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఓ అనురాధ శుక్రవారం తెలిపారు. పథకానికి అర్హులైన రైతులు 1బీ, ఆధార్ కార్డ్ జిరాక్స్‌లతో పాటు అన్ని పత్రాలను సంబంధిత సచివాలయాల్లో వీఏఏలకు అందచేయాలని సూచించారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

వేపాడ: మండలంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై వేపాడ గ్రామ సచివాలయం ఆవరణలో శుక్రవారం ప్రజావేదిక నిర్వహించారు. ఆడిట్ నివేదికలను ఎస్‌ఆర్‌పీ చిరంజీవి చదివి వినిపించారు. వేతనదారులకు సంబంధించి 707 పనులు, పంచాయతీరాజ్‌కు సంబంధించి 82 పనులు మొత్తం 790 పనులు చేపట్టగా.. వేతనదారులకు రూ. 13,67,74,205లు వేతనాలుగా, రూ. 1,57,86,527లు మెటీరియల్ కోసం ఖర్చు చేసినట్లు చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలలో సుమారు 70శాతం చనిపోయినట్లు గుర్తించారు. కార్యక్రమంలో ఎస్.కోట ఏపీడీ శారదాదేవి, డ్వామా ఏపీఓ రమణమూర్తి, జెక్సూసీ జె.రాము, సీనియర్ ఈసీ కె.యుగేష్, ఏపీఓ ఆర్.సన్యాసినాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, డీఆర్‌పీలు, ఎఫ్‌ఏలు, టీఏలు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి

• డీపీఓ శ్రీధర్ రాజ

వేపాడ: గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు సేవలందించటంతో పాటు బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజ సూచించారు. వీలుపర్తి పంచాయతీలో శుక్రవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్యం, విద్యుత్ వీధిదీపాల నిర్వహణపై ఆరాతీశారు. గ్రామంలో రామాలయం వద్ద, గ్రామ కూడలి వద్ద పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని, కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని సూచించారు. వెలగని వీధిలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అనూష, గ్రామ సర్పంచ్ శానాపతి లీల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కొత్తవలస: సంక్షేమ పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

• ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీ సచివాలయం-2 పరిధిలోని రైల్వేస్టేషన్, కొత్తవలస జంక్షన్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా గత నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షమేనని అన్నారు. ప్రభుత్వంపై రోజురోజుకు పెరుగుతున్న ప్రజాధారణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వారి ఇంటి వద్దకే చేరుస్తూ..సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతుగా నివాలాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.పద్మజ, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి జయప్రకాష్, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బొంతల వెంకటరావు, నాయకులు మేలాస్త్రీ అప్పారావు, గొరపల్లి రవికుమార్, కోరుబిల్లి స్వామినాయుడు, వార్డు సభ్యులు, వలంటీర్స్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

జామి: పేదల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అలమండ పంచాయతీ కుద్దుపాలెంలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. కుద్ది గ్రామానికి చెందిన జాన కృష్ణ ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో మృతుని భార్య రాజేశ్వరికి రూ.3 లక్షలు, అలాగే చింతాగ గ్రామానికి చెందిన యర్రసాయి అనే విద్యార్థి మృతి చెందడంతో మృతుని తల్లి యర్ర లక్ష్మికి రూ.లక్ష చెక్కును ప్రభుత్వం మంజూరు చేసింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, పార్టీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూరిబాబురాజు, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, అలమండ, చింతాడ సర్పంచ్‌లు కోట పాపమ్మ, అప్పాన సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జి.రాజేరులో సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం మండలంలోని బి.రాజేరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పాలనలో ఆంధ్రప్రదేశ్ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి, గిరిజన యూనివర్సిటీని మంజూరు చేయడంతో పాటు శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా కోట్లాది రుపాయలు విలువైన ప్రభుత్వ స్థలాలను పేదలకు ఇళ్ల పట్టాలుగా అందివ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క పేదవాడికైనా ఇళ్ల పట్టా ఇచ్చారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ అనుచరులుకే అన్ని సంక్షేమ పథకాలు ఇచ్చేవారని, ఇప్పుడు పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభూజీ, ఎ.ఎ.సి చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, పార్టీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, మాజీ ఎంపీపీ బండారు బంగారం, వైస్ ఎంపీపీ జి.ఈశ్వరరావు, ఎంపీడీఓ ఎ.వేధవతి, గొల్లు సతీష్, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

• డీవీఈఓ సురేష్ కుమార్

చీపురుపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు క్లినికల్ అటాచ్‌మెంట్ శిక్షణ గొప్ప వరమని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి ఆర్.సురేష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు చదివిన 11 మంది విద్యార్థులను క్లినికల్ అటాచ్‌మెంట్ శిక్షణకు స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వృత్తివిద్యా కోర్సులు చదువుతున్న వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ ముఖ్యమని, అప్పుడే మెరుగైన ఉద్యోగావకాశాలు, ఆకర్షణీయమైన వేతనాలు వస్తాయన్నారు. జిల్లాలో తొలిసారిగా క్లినికల్ అటాచ్‌మెంట్ శిక్షణా కార్యక్రమాన్ని చీపురుపల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. విలువైన శిక్షణా సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వినోద్‌బాబు, అధ్యాపకుడు టీవీడీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాల సాగుతో నేలకు జీవం



చిరుధాన్యాల సాగు ఆవశ్యకతను వివరిస్తున్న డీపీఎం ఆనందరావు

కొత్తవలస: చిరుధాన్యాల సాగుతో భూమికి జీవం వస్తుందని డీపీఎం ఆనందరావు అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో సబల సంస్థ ఆధ్వర్యంలో సుమారు 300 మంది రైతులకు శుక్రవారం చిరుధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు 30 రకాల విత్తనాలతో ఉన్న 13 కిలోల కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే రైతులు పొలాన్ని దుక్కి చేసి ఈ విత్తనాలు వేసుకోవాలన్నారు. 45 రోజుల తర్వాత పంటను భూమిలో కలియ దున్నాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ విరోతి కొండలరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బొండపల్లి: ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. మండలంలోని బి.రాజేరు గ్రామంలో 2023-24 ఖరీఫ్ కార్యచరణపై శుక్రవారం అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని రైతులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని సర్పంచ్ గేదెల ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కాలంరాజుపేట గ్రామ సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించే వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు.

సంక్షిప్తంగా..

తాగునీటి సరఫరాలో వివక్ష చూపొద్దు

దత్తిరాజేరు: గ్రామాల్లో తాగునీరు సరఫరా చేస్తున్న పంపు ఆపరేటర్లు స్వప్రయోజనాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కవిత అన్నారు. చుక్కపేటలో శుక్రవారం అన్ని గ్రామాల పంపు ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. వేసవిలో ప్రజలందరికీ తాగునీరు సరఫరా చేయాలని, కొందరికి చేసి ఇంకొందరిక చేయడం లేదని ఫిర్యాదులు అందితే పంపు ఆపరేటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ కుళాయి కనెక్షన్లు ఉంటే గ్రామ కార్యదర్శుల ద్వారా నోటీసులు ఇచ్చి తొలగించాలని సూచించారు. జేఈ నానిబాబు, తాగునీరు సరఫరా నిర్వాహకులు మహేష్ ఉన్నారు.

న్యాయవాదుల నిరసన

శృంగవరపుకోట: సీఐడీ పోలీసులు విజయవాడలో పలువురు న్యాయవాదులకు నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తూ ఎస్.కోట బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టులో విధులు బహిష్కరించారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడిన న్యాయవాదులకు నోటీసులు ఇవ్వడాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లు సత్యాజీ, నర్సింహశర్మ తప్పుపట్టారు. న్యాయవాదుల భావప్రకటన స్వేచ్ఛను హరించేలా సీఐడీ వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బి.త్రిమూర్తులు, వి.రమణ, టి.వి.ఆర్.మూర్తి, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, జి.చిట్టిబాబు తదితరులు హాజరయ్యారు.

వేపాడలో ప్రచారభేరి

వేపాడ: ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదింపి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ(ఎం) నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ప్రచారభేరి నిర్వహించారు. కార్యక్రమంలో మద్దిల రమణ, భీముడు, అప్పారావు, నారాయణ, అప్పలనాయుడు, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

68 మందికి వైద్యసేవలు

జామి: మండల కేంద్రమైన జామి సచివాయలం-2 పరిధిలో పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా 68 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఇంటింటికీ వెళ్లి బెడ్‌రెస్ట్ పేషెంట్లకు వైద్యసేవలు అందజేశారు. ఆరోగ్య సిబ్బంది సత్యనారయణ, నీహరిక, లత, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

వేపాడ: మండలంలో వల్లంపూడి గ్రామంలో తాగునీటి సమస్యపై స్థానిక మహిళలు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి శుక్రవారం గ్రామంలో పర్యటించారు. తగునీటి సమస్యపై స్థానికుల వద్ద వివరాలు సేకరించారు. తాగునీటి కుళాయిల ఏర్పాటుకు ఉపసర్పంచ్ రుద్రవెంకటరావు సమక్షంలో కొలతలు వేశారు.

జలసిరి బోరు తనిఖీ

గజపతినగరం రూరల్: మండలంలోని కేఎస్ఆర్ పురం గ్రామంలో వైఎస్సార్ జలసిరి పథకం కింద ఏర్పాటు చేసిన బోరును డ్వామా కార్యాలయం సిబ్బంది గురుమూర్తి, టీఏ సీహెచ్ రమణ పరిశీలించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా బోర్లను పరిశీలించినట్లు వారు తెలిపారు.

నీలగిరి తోట దగ్ధం

కొత్తవలస: మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామం సమీపంలో గల నీల గిరి తోట ప్రమాదవశాత్తు శుక్రవారం సాయంత్రం దగ్ధమైంది. కొత్తవలసకు చెందిన ఆర్ దిలీప్‌కుమార్ తోటలో ఒక్కసారిగా మంటలు చెలరేగి చుట్టుముట్టాయి. మంటలను గుర్తించిన స్థానికులు కొత్తవలస ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్‌స్టేషన్ అదికారి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే సుమారు రెండు ఎకరాల్లో తోట పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు అధికారులు గుర్తించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

శృంగవరపుకోట: మండలంలో చామలాపల్లి, తెన్నుబొడ్డవర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం వార్షికోత్సవాలు నిర్వహించారు. చామలాపల్లి పాఠశాలలో పీజీఎస్ సతీష్ కుమార్ అధ్యక్షతన, తెన్నుబొడ్డవర పాఠశాలలో హెచ్‌ఎం పి.గోపాలరావు నేతృత్వంలో జరిగిన వేడుకల్లో ఎంఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

ఉపాధి పనులు ఒక పూటే చేపట్టాలి

వేపాడ: ఉపాధిహామీ పథకం పనులు ఒక పూట చేసేలా వెసులుబాటు కల్పించాలని సర్పంచ్‌లు ఎ.పైడిబాబు, కొలా సతీష్, వార్డు మెంబర్లు ఎం.వెంకటరమణ, ముత్యాలునాయుడు, ఎంపీటీసీ ఎ.సత్యనారాయణ తదితరులు కోరారు. ఈ మేరకు ఎస్.కోట ఏపీడీ శారదాదేవికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై ఏపీడీ సానుకూలంగా స్పందించారు. ఎండలు తగ్గినంత వరకు ఒక పూట పనిచేసుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు.

సాంకేతిక సమస్యలపై నివేదిస్తాం

వేపాడ: మండలంలో వల్లంపూడి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సాంకేతిక సమస్య కారణంగా అమ్మఒడి నిధుల పడకపోవడంపై అమరావతి సచివాలయానికి నివేదిస్తామని డీఎల్‌డీఓ నిర్మలాదేవి అన్నారు. శుక్రవారం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. గ్రామానికి చెందిన 22మంది విద్యార్థులకు అమ్మఒడి పడకపోవటంతో పాఠశాల హెచ్‌ఎం అర్జునరావు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఉపసర్పంచ్ రుద్రవెంకటరావు, ఎంపీడీఓ పట్నాయక్ తదితరులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

గుర్ల: మండలంలోని భూపాలపురంలో పాడైన తాగునీటి బోర్లను ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది శుక్రవారం బాగుచేశారు. క్రాష్ ప్రోగ్రాం కింద పాడైన తాగునీటి బోర్లు బాగుచేస్తున్నట్లు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, సర్పంచ్ శీర విజయకుమారి చెప్పారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటాం



బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

• జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని రుంకాన వీధిలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు పూరిల్లు దగ్ధమైన విషయం విధితమే. బాధితులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ప్రభుత్వం నుంచి పక్కా ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా బాధితుల ఖాతాల్లో రూ.5 వేలు చొప్పున జమ చేయనున్నట్లు చెప్పారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, పప్పు, గ్యాస్ స్టౌ, సిలిండర్ పంపిణీ చేశారు. బాధితులకు తాత్కాలికంగా పునరావాసం కల్పించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. వారి వెంట జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దనరావు, పతివాడ రాజారావు, తహసీల్దార్ ఎం.సురేష్, సీఎస్‌డీటీ పి.రామారావు, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు తదితరులు ఉన్నారు.

బాధితులకు బాసటగా..

చీపురుపల్లి: పట్టణంలోని రుంకానవీధిలో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు స్థానిక లైన్స్‌క్లబ్, స్టార్స్ లైన్స్‌క్లబ్ తరఫున సాయం అందించారు. ఆయా సంస్థల అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, కందుల తవిటిరాజు, ఎస్.సన్యాసిరావు చేతులమీదుగా బాధితులకు చీరలు, పంచెలు, తువ్వాల్లు, కిరాణా సామగ్రి, 5 కేజీల బియ్యం అందజేశారు. అలాగే చీపురుపల్లి పోలీస్ స్టేషన్ నుంచి ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది వంద కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందించి బాసటగా నిలిచారు. అదే విధంగా విజయనగరం రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి బాధితులకు నిత్యావసర సరుకులు, వంటపాత్రలు, దుస్తులను ఆ సంస్థ జిల్లా ప్రతినిధి రెడ్డి రమణ అందజేశారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు కృషిచేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగా నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధ్యాపకులు పనిచేయాలని, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడంతో పాటు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పిరుబండి జైహింద్ కుమార్, గజపతినగరం, గంట్యాడ, దత్తిరాజేరు మండలాల ఎంపీపీలు బెల్లాన జ్ఞానదీపిక, పీరుబండి హైమావతి, గేదెల సింహాద్రి అప్పలనాయుడులు, బొండపల్లి, దత్తిరాజేరు మండలాల జెడ్పీటీసీలు రాపాక సూర్యప్రకాష్, రౌతు రాజేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

కరకాంలో లేగదూడల ప్రదర్శన



లేగదూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి రూరల్: జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కరకాం గ్రామంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శనను నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాడిరైతులకు కృత్రిమ గర్భధారణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. లేగదూడల ప్రదర్శనలో మేలైన ఆవుదూడలను ఎంపిక చేసి పాడిరైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారులు ఈఓ ఎన్.దామోదరరావు, డీడీ రామచంద్రరావు, ఏడీలు శ్రీలక్ష్మీ, ఆర్.శారద, వెటర్నరీ వైద్యులు కె.జయకాంత్, హేమలత, సర్పంచ్ జమ్ము సావిత్రి, ఎంపీటీసీ గంగుపల్లి సూరీడమ్మ పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కోరారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం చేపట్టారు. టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాలను వివరించారు. సీఎం జగన్ ఫొటోతో ఉన్న స్టిక్కర్లను ఇంటి గోడలకు అంటించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తవలస: రైల్వేస్టేషన్ కాలనీలో ఓ ఇంటి గోడకు సీఎం జగన్ ఫొటోతో ఉన్న స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే కడుబండి



మెరకముడిదాం: బైరీపురంలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



దత్తిరాజేరు: కె.కృష్ణాపురంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీనువాసరావు



గుర్ల: దమరసింగిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

బొండపల్లి: జగనన్న లేఅవుట్లలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగంవంత చేయాలని ఎంపీడీఓ ఎ.వేదవతి అన్నారు. మండలంలోని దేవుపల్లి గ్రామంలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈఈ రమణరాజు, సచివాయల ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట జగనన్న లేఅవుట్‌లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ పరిశీలించారు. గ్రామంలో 20 మందికి ఇళ్లు మంజూరు కాగా.. ప్రస్తుతం 11 నిర్మాణాలు పూర్తయినట్లు అధికారులు చెప్పారు. మిగిలిన వాటిని కూడా త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారి సూచించారు. హౌసింగ్ ఏఈ అప్పలనాయుడు, విద్యుత్‌శాఖ ఏఈ సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవీ, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసు పాల్గొన్నారు.

త్వరితగతిన బిల్లు చెల్లింపు

దత్తిరాజేరు: ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వారికి త్వరితగతిన బిల్లులు చెల్లించడం జరుగుతుందని హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ అన్నారు. ఎస్.చింతలవలసలో నిర్మాణాలు జరుగుతున్న గృహాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు కావాల్సిన సిమ్మెంట్, విద్యుత్ సామాన్లు రాయితీపై అందచేయడం జరుగుతుందన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

జామి: ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు కమిషనరేట్ నుంచి వచ్చిన ఏడీ హెచ్ రత్నాచారి అన్నారు. మండలంలోని లోట్లపల్లిలో మామిడి కలెక్షన్ సెంటర్‌ను, అలమండలో మామిడి సేకరణ కేంద్రాన్ని, కోల్డ్ స్టోరేజీని శుక్రవారం పరిశీలించారు. సంవత్సరం పొడవునా ఈ కేంద్రాలను వినియోగించుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. విజయగనరం ఉద్యానవనశాఖ ఏడీ హెచ్ కె.శైలజ, హెచ్ఓ ఎ.అనిత, ఎంపీఈఓ సతీష్‌కుమార్, మామిడి ఉత్పత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు లగుడు దేముడు పాల్గొన్నారు.